క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయం కిటకిట



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి ఉన్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. సంక్రాంతికి గ్రామాలకు వచ్చిన భక్తులు దర్శనానికి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ ఎం.అరుణ్ కుమార్, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షించారు.

యువత క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ

పాలకొల్లు అర్బన్: పండుగ రోజుల్లో యువత జూద క్రీడలవైపు దృష్టి మరలకుండా క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ అన్నారు. పాలకొల్లు పట్టణంలోని శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అంబటి సాయి, జి.కౌశిక్, జి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

నరసాపురం: పట్టణంలో పొన్నపల్లిలో ఓ ఇంట్లో పేకాడుతున్నారన్న సమాచారంతో ఆదివారం పోలీసులు దాడి చేశారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇంటిపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు టౌన్ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి చెప్పారు. వారి వద్ద నుంచి రూ 3,200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



క్రికెట్ టోర్నమెంట్‌లో ట్రోఫీని అందుకుంటున్న విజేతలు

భీమవరం: డీఎన్నార్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ రీయూనియన్ మ్యాచ్‌లు ఆదివారం ముగిశాయి. భీమవరం గ్రీన్స్, బ్లూస్ జట్లు మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భీమవరం బ్లూస్ జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 155 పరుగులు చేసింది. ఈ జట్టులో సారిక త్రిమూర్తులు 39, పులగం శేషు 22 పరుగులు చేశారు. తరువాత బ్యాటింగ్ చేసిన భీమవరం గ్రీన్స్ జట్టు 22.5 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 156 పరుగులు చేసి విజయం సాధించారు. ఈ జట్టులో సతీష్ 50, కృష్ణమోహన్ 50 (నాటౌట్) పరుగులు శర్మ 48 (నాటౌట్)గా నిలిచారు. ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్ ప్రతిభ కనబర్చిన కృష్ణమోహన్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచారు. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పులపర్తి ప్రశాంత్ చేతుల మీదుగా విన్నర్స్ ట్రోఫీని గ్రీన్ జట్టు కెప్టెన్ మానేపల్లి సూర్య మాణిక్యం అందుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రెటరీ శ్రీనివాస్‌రాజు చేతుల మీదుగా రన్నర్స్ ట్రోఫీని బ్లూస్ కెప్టెన్ డీఎస్ రాజు అందుకున్నారు. కార్యక్రమంలో డీఎన్నార్ కళాశాల సెక్రటరీ శ్రీగాదిరాజు బాబు, కార్యవర్గ సభ్యులు బోసు రాజు, సీఐ కాళీచరణ్, తదితరులు పాల్గొన్నారు. మొత్తం మూడు రోజుల పాటీల్లో బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా కిషోర్ (ఏలూరు), బెస్ట్ ఫీల్డర్‌గా నూకల శ్రీనివాస్ (హైద్రాబాద్), బెస్ట్ బౌలర్‌గా రెహమాన్ (హైదరాబాద్), మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా శర్మ (ఏలూరు) ఎంపిక అయ్యారు.

వంతెనకు మరమ్మతులు

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలో ఉండి కాలువపై ఉన్న వంతెనకు ఆదివారం మరమ్మత్తులు చేశారు. గత కొన్నేళ్ల నుంచి వంతెనపై రేకు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రధాన గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌ను ఆనుకుని వంతెన ఉండటంతో పలువురు విద్యార్థులు, గ్రామంలోని రైతులు గాయపడ్డారు. దీంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం పాతరేకుపై మధ్య భాగంలో కొత్తరేకు ఏర్పాటు చేసి మరమ్మతులు చేపట్టారు. దీంతో స్థానిక విద్యార్థులతో పాటు, ఎస్సీ, బీసీ కాలనీలకు చెందిన విద్యార్థులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. వచ్చే వేసవిలో వంతెన మధ్య భాగంలో రేకు తొలగించి శ్లాబ్ వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సూరవరపు వెంకటాచార్యులు, ముగ్గళ్ల సత్యనారాయణ, చిలుకు చంటి, తదితరులు పాల్గొన్నారు.

తీరంలో కోడి రెడీ

- తీరంలో ఎన్నడూలేని విధంగా బరులు సిద్ధం
- హెచ్చరికలతో సరిపెట్టి చోద్యం చూస్తున్న పోలీసులు
- కూటమి నేతల కనుసన్నల్లో ఏర్పాట్లు
- ప్రతి 5 పంచాయతీలకూ ఒక బరి ఉండేలా ప్లాన్



యలమంచిలి మండలం గుంపర్రులో సిద్ధం చేసిన కోడి పందేల బరి

నరసాపురం: నరసాపురం తీరంలో గతంలో ఎన్నడూలేని విధంగా ఈ సంవత్సరం కోడిపందేలు, పేకాట, గుండాట జూదాలు పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పందెం రాయుళ్లు ఎంపిక చేసిన ప్రాంతాల్లో భారీ టెంట్‌లు, రాత్రి పూట సాంస్కృతిక కార్యక్రమాల మాటున జూదాలు జరపడానికి భారీ సెట్టింగ్స్‌తో స్టేజ్‌లు కడుతున్నారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో దాదాపుగా ఏర్పాట్లు పూర్తి చేశారు. భోగి రోజు నుంచి మూడు రోజులు పాటు నిరాటంకంగా కోడి పందేలు, జూదాలు నిర్వహించడానికి సన్నద్ధమయ్యారు. గత వారంరోజుల నుంచి పోలీసులు హెచ్చరికల ప్రకటనలతో ఊదరగొడుతున్నారు. కోడిపందాలకు బరులు సిద్ధం చేస్తే సదరు స్థలాల యజమానులపై కూడా కూడా కేసులు నమోదు చేస్తామని ప్రకటిస్తున్నారు. అయితే గతరెండు రోజులు నుంచి నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో సినీ సెట్టింగ్స్ టైపులో బరుల ఏర్పాట్లు జరుగుతుంటే పోలీసులు కన్నెత్తి చూడకపోవడం విశేషం. నియోజకవర్గంలో కోడిపందేలు, జూదాలు మొత్తం కూటమి నేతల కనుసన్నల్లో జరుగుతుంది. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తోడు, భారీగా ఇప్పటికే ముడుపులు అందడంతో పోలీసులు మౌనముద్రలో ఉన్నారనే విమర్శలు వస్తున్నాయి.

ప్రతి ఐదు పంచాయతీలకూ ఓ బరి

నియోజకవర్గంలో మున్సిపాలిటీతో పాటుగా నరసాపురం మండలం, మొగల్తూరు మండలాల్లోని ప్రతి గ్రామంలో అందుబాటులో పండుగ మూడు రోజులు యువతకు ఓ జూదం బరి అందుబాటులో ఉండేలా పందెంరాయుళ్లు, వెనకున్న కూటమి నేతలు వ్యూహరచన చేశారు. దీంతో ఎప్పుడూ లేని విధంగా పెద్ద సంఖ్యలో బరులు సిద్ధం చేస్తున్నారు. మున్సిపాలిటీలో ప్రభుత్వ ఆసుపత్రి వెనుక, అలాగే వీవర్స్ కాలనీ శివారు, పీచుపాలెం ప్రాంతాల్లో భారీగా 5 బరులు సిద్ధం చేస్తున్నారు. ఇక నరసాపురంమండలం రుస్తుంబాధ, వేములదీవి, లక్ష్మణేశ్వరం, పసలదీవి, మల్లవరం, నవరసపురం, చిట్టవరం, తూర్పుతాళ్లు, సీతారామపురం ప్రాంతాల్లో 15 చోట్ల బరులు సిద్ధం చేశారు. మొగల్తూరు మండలం మొగల్తూరు, పేరుపాలెం, శేరేపాలెం, కొత్తోట, రామన్నపాలెం ప్రాంతాల్లో 10 చోట్ల బరులు ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలో 31 వార్డులకు అందుబాటులో ఉండేలా బరులు సిద్ధం చేశారు. ఇక గ్రామాల్లో ప్రతి 5 పంచాయతీలకు ఒక బరి అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. సంక్రాంతికి మన జిల్లాలో కోడి పందేలకు పేరుంది కానీ, నరసాపురం ప్రాంతం మాత్రం అంతగా పందేలకు, జూదాలకు అంతగా ప్రాధాన్యం ఉండేది కాదు. కానీ ప్రస్తుత పరిస్థితిని చూసి ఈ విష సంస్కృతి నరసాపురంలో కూడి విస్తృతం చేసే ఖర్మ తెచ్చారని ప్రజలు వాపోతున్నారు.

జాతరను తలపించేలా సెట్టింగ్‌లు

యలమంచిలి: మండలంలోని పలు గ్రామాలలో కోడి పందేల నిర్వహణకు బరులు సిద్ధమయ్యాయి. కోడి పందేలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్న పోలీసుల హెచ్చరికలు పని చేయలేదు. కలగంపూడి, గుంపర్రు, మట్లపాలెం, యలమంచిలి, కాజ, వడ్డిలంక, కొంతేరు, మేడపాడు, కనకాయలంక, బూరుగుపల్లి గ్రామాలలో కోడి పందేలు నిర్వహణకు బరులు సిద్ధం చేశారు. కోడి పందేల బరులు వద్ద సంక్రాంతి పండగ వాతావరణాన్ని సృష్టిస్తూ జెయింట్ వీల్స్ ఏర్పాటు చేయడంతోపాటు టీవీ కళాకారులతో మ్యూజికల్‌నైట్స్, జబర్దస్త్ కామెడీ స్కిట్స్ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ మూడు రోజులు కోడి పందేలతోపాటు, గుండాట, పేకాట, కోతాట వంటి జూద క్రీడలు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై వంటి మహానగరాల నుంచి పెద్ద సంఖ్యలో గోదావరి జిల్లాలకు చెందిన యువకులు, వారి స్నేహితులు, బంధువులు పెద్ద సంఖ్యలో గ్రామాలకు చేరుకోవడంతో గ్రామీణ రోడ్లన్నీ కార్లతో రద్దీగా మారాయి. వీరంతా ఈ మూడు రోజుల్లో జూద క్రీడల్లో కోట్లాది రూపాయిలు పందేలు కాయడానికి సిద్ధంగా ఉన్నారు.



నరసాపురం ప్రభుత్వాసుపత్రి వెనుక గ్రౌండ్‌లో బరి ఏర్పాటు చేస్తున్న దృశ్యం



రుస్తుంబాద వద్ద గుండాట నిర్వహణకు భారీగా వేసిన టెంట్లు



గుంపర్రులో బరుల వద్ద ఏర్పాటు చేసిన జెయింట్ వీల్స్

వైభవంగా సీతారామ సప్తాహం



స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని సీతారామపురం గ్రామంలో ఉన్న సీతారామ లక్ష్మణ, వీరాంజనేయుల ఆలయంలో 61వ సప్తాహ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 18 వరకూ ఈ కార్యక్రమం నిరాటంకంగా సాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ముందుగా ఈలి శ్రీనివాసు, నాగవెంకటలక్ష్మి దంపతులు కలశస్థాపన చేసి పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మోగల్లుకు చెందిన మోగంటి రాంబాబు బ్రదర్స్ బృందం సీతారామ సప్తాహ నాదస్వరం కచేరీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పండుగ పేరుతో పందేలు వద్దు



కోడిపందేల శిబిరం వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయిస్తున్న తహసీల్దార్

యలమంచిలి: సంక్రాంతి పండుగ పేరుతో జూద క్రీడలు నిర్వహించవద్దని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ హెచ్చరించారు. సంప్రదాయం పేరుతో కోడి పందేలు, గుండాట, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన, చూసిన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు గ్రామాల్లో ఆదివారం ర్యాలీలు నిర్వహించి, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

దాడి కేసు నమోదు

ఉండి: గోరింతోటలో వ్యక్తిపై జరిగిన దాడి ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి గోరింతటలోని చర్చ్ వద్ద ఈ నెల 31వ తేదీ రాత్రి చోటు చేసుకున్న వివాదంలో మునకాల రవిరాజు అనే వ్యక్తిపై అదే ప్రాంతానికి చెందిన చింతాల జయశేఖర్ అనే వ్యక్తి దాడికి పాల్పడంతో రవిరాజు గాయపడ్డాడు. దీంతో అతడిని భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పి చికిత్స అందించారు. ఆసుపత్రి నుంచి తమకు అందిన సమాచారం మేరకు, బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గులు వేస్తున్న మహిళలు



హరే శ్రీనివాస ఆధ్వర్యంలో కోలాటం ఆడుతున్న చిన్నారులు

విజేతలకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం



మొగల్తూరు: మొగల్తూరులో సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. స్థానిక వివేకా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, వివిధ పార్టీల నాయకుల సహకారంతో ఆదివారం గ్రామంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. భోగి మంటలు, మహిళలు వేసిన ముగ్గులు, స్థానిక హరే శ్రీనివాస భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాట ప్రదర్శనలను గ్రామస్తులు తిలకించారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి వేడుకలు ఒక రోజు ముందుగానే ప్రారంభమయ్యాయి. భోగి పండుగ సోమవారం అయినప్పటికీ ఆదివారం చాలా గ్రామాల్లో భోగి మంటలు వేశారు. మహిళలకు రంగవల్లుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, చెడుగుడు తదితర పోటీలను నిర్వహించారు. పితానిమెరక గ్రామంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు సుమారు రూ.25 వేలు విలువైన బహుమతులను అందించారు. కొప్పర్రు గ్రామంలో దాత పోలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

అ'పూర్వ' కలయిక



పీఎల్‌కే హైస్కూల్‌లో రిటైర్డు ఉపాధ్యాయులను సత్కరిస్తున్న 1988-89 బ్యాచ్ విద్యార్థులు

పాలకొల్లు అర్బన్: ప్రస్తుత తరానికి తెలుగు భాష ప్రాధాన్యతను తెలియజేయాలని రిటైర్డు ఉపాధ్యాయులు విశ్వనాథం, విశ్వేశ్వరరావు కోరారు. పట్టణంలోని పూడి లాజరు కృపావరం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1988-89 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ద్వారా ఆత్మీయతలు, స్నేహసంబంధాలు వృద్ధి చెందుతాయని వక్తలు అన్నారు. ఆహ్వాన కమిటీ చైర్మన్ సనమండ మోరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన పూర్వ విద్యార్థులు పాల్గొని రిటైర్డు ఉపాధ్యాయులను సత్కరించారు.

బీసీ కులగణన చేయాలి



పాలకొల్లు పట్టణ మహిళా అధ్యక్షురాలు కోరుకొండ సంతోషిని అభినందిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: దేశంలో 60 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభాను కులాల వారీగా గణన చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవాని డిమాండ్ చేశారు. ఆదివారం పాలకొల్లులో నిర్వహించిన సమావేశంలో గణేష్ భవాని పాల్గొని పట్టణ మహిళా అధ్యక్షురాలుగా కోరుకొండ సంతోషిని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంపదలో బలహీన వర్గాల వాటా ఎంత ఉందో రాజకీయ వాటా కూడా అంతే ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు, సంఘ నాయకులు పొన్నమండ ముత్యాలరావు, బీరక ప్రసాద్, వింజరపు శంకరం, కోరుకొండ సుబ్బారావు, నీలంశెట్టి సత్యప్రసాద్, పాశర్ల మాధవ్‌నారాయణ, అంగర దేవకుమార్ పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జీవితం యువతకు ఆదర్శం



పెనుగొండ: ఎస్‌వీకేపీలో కళాశాలలో నిర్వహించిన జాతీయ యువజనోత్సవంలో విజేతలు

పెనుగొండ: స్వామి వివేకానందజీవితం యువతకు ఆదర్శంగా ఉండాలని పెనుగొండ ఎస్‌వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్‌రాజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు అన్నారు. ఆదివారం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, మహిళా సాధికారత విభాగం, నెహ్రూ యువ కేంద్రం, జిల్లా క్రీడా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ యువజనోత్సవాలు ముగింపు సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు క్రీడలు అకడమిక్ పోటీలు, ముగ్గులు, వక్తృత్వ పోటీలు, ఇతర సాంప్రదాయ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పీవై కృపావరం, సంక్రాంతి సూర్యనారాయణ, జె.వాసుదేవరావు, ఎన్‌సీసీ అధికారులు జి.శ్రీనివాస్, పీడీ డాక్టర్ బి.బాపి రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారులు టి.దివాకర్, ఆర్ఎన్ శ్రీనివాస్, పి.మీరయ్య, మహిళా సాధికారిత విభాగ కన్వీనరు వి.కవితాకుమారి తదితరులు పాల్గొన్నారు.

వడలిలో

వివేకానంద యూత్ ఆధ్వర్యంలో వడలిలో స్వామి వివేకానంద 163వ జయంతిని ఘనంగా నిర్వహించారు. వివేకానంద కూడలిలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసాని విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి గణేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు దొడ్డిపట్ల నాగూర్ పాల్గొన్నారు.

నరసాపురంలో..



నరసాపురం: వివేకానందుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నరసాపురం: వివేకానందుని ఆశయాలు కొనసాగించడానికి ప్రయత్నించాలని పలువురు పేర్కొన్నారు. 14వవార్డు అంకానివారి పాలెంలో సామరస్యతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు కొప్పాడ కృష్ణవేణి, బొమ్మిడి సూర్యకుమారి మాట్లాడుతూ వివేకానందుడి జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో తోట అరుణ, పెమ్మాడి గణపతిరాజు, కొపనాతి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

పాలకొల్లులో..



పాలకొల్లు అర్బన్: జీవీఎస్‌వీఆర్ మునిసిపల్ పాఠశాలలో వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: యువకులే దేశానికి నిజమైన సంపద అని ప్రబోధించిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద హెచ్ఎం రాయపూడి భవాని ప్రసాద్ అన్నారు. పట్టణంలోని జీవీఎస్‌వీఆర్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం జాతీయ యువజన దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక యువజనులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దాళ్వా పనుల జోరు



రావిపాడులో చేలో దమ్ము చేస్తున్న దృశ్యం




పోడూరులో వరినాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

బెంగాలీ కూలీలతో నాట్లు వేయిస్తున్న రైతులు

పోడూరు: మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో దాళ్వా వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. మండలంలో దాదాపు 13 వేల ఎకరాల్లో వరిసాగు జరుగుతుంది. దాళ్వా సాగు నిమిత్తం ఇప్పటికే చాలామంది రైతులు నారుమడులు వేసి 20 పైగా రోజులు అవుతుంది. చాలా మంది రైతులు పీఆర్-126, ఎంటీయూ-1121 రకం వంగడాలతో దాళ్వా సాగు చేస్తున్నారు. ఇప్పటివరకు మండలవ్యాప్తంగా దాదాపు 20 శాతం పంటచేలల్లో వరినాట్లు పూర్తయ్యాయి. మిగతా చేలల్లో గట్టులంకలు బాగుచేయడం, దమ్ములు చేయడం, ఎరువులు చల్లడం వంటి పనులు జోరుగా సాగుతున్నాయి. కూలీ ఖర్చులు, పెట్టుబడి ఖర్చులు తక్కువ కావడంతో వరి నాట్లు వేయడానికి రైతులు ఎక్కువగా బెంగాలీ కూలీలను ఆశ్రయిస్తున్నారు. నాట్లు వేయడానికి బెంగాలీ కూలీలు ఎకరాకు దాదాపుగా రూ.4 వేలు తీసుకుంటున్నారు. అలాగే బెంగాలీ కూలీల పద్ధతిలో నాట్లు వేస్తే ఎకరాకు దాదాపుగా 12-15 కేజీల విత్తనాలు సరిపోతాయని రైతులు చెబుతున్నారు. అదే సాధారణ పద్ధతిలో నాట్లు వేస్తే ఎకరాకు దాదాపుగా 20-25 కేజీల విత్తనాలు ఖర్చవుతాంటున్నారు. నీటిఎద్దడి సమస్య రాకుండా ఉండడంతో పాటు వాతావరణం అనుకూలించి తుఫానులు, అకాల వర్షాలు లేకుండా ఉంటే ఎకరాకు ఈ దాళ్వా సీజన్‌లో 40-45 బస్తాల దిగుబడి సాధించవచ్చని రైతులు ఆశిస్తున్నారు.

దమ్ములు చేస్తున్నాం



నాకున్న రెండెకరాల సొంతభూమిలో వ్యవసాయం చేస్తున్నాను. ఈ దాళ్వాకు ఎంటీయూ-1121 విత్తనాలతో నారుమడి వేశాను. ప్రస్తుతం దమ్ములు చేస్తున్నాం. పంటచేలకు అవసరమైన దశల్లో నీటి ఎద్దడి లేకుండా ఉండడంతో పాటు చివరి దశలో వర్షాలు, తుఫానులు లేకుంటే ఈ దాళ్వాలో మంచి దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నాను.

– పెచ్చెట్టి ముత్యాలరావు, మట్టపర్రు

వరినాట్లు త్వరగా పూర్తి చేసుకోవాలి



దాళ్వాసాగు కోసం రైతులు వీలైనంత త్వరగా వరినాట్లు వేయడం పూర్తి చేయాలి. దీనివల్ల వేసవికి ముందు నీటిఎద్దడి సమస్య ఉండదు. అలాగే రైతులు తమ గ్రామాల్లోని రైతుసేవా కేంద్రానికి వెళ్లి ఈ-పంట నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. మండలంలో అన్ని గ్రామాల్లోనూ రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

– జి.సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారి